## తట్టతో పంటకు తడి

నిర్మల్ జిల్లాలోని నీలాయిపేట్‌కు చెందిన రైతు కోట రాజన్న తనకున్న ఐదెకరాల్లో నీరు లేక రెండున్నరెకరాల్లో పంట సాగు చేశాడు. ఉన్న రెండు బోర్లలో ఒకటి మోటర్ కాలిపోయింది. మరో దాంట్లో నీరు కొద్దికొద్దిగా వస్తున్నది. దీంతో ఆ నీటిని జాగ్రత్తగా పట్టుకొని ఇలా తట్టలతో పంటను తడుపుతున్నాడు.

## చెలిమ నీళ్లే దిక్కు

ములుగు జిల్లా మంగపేట సమీప అటవీ ప్రాంతంలోని శాంతినగర్, పోచమ్మగూడెం గొత్తికోయలు తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. అడవుల్లోని కాల్వలు ఎండిపోవడంతో సుమారు యాభై కుటుంబాలు నీటి కోసం గోసపడుతున్నాయి. పోచమ్మగూడెంలో ఉన్న ఒక్క బోరు నీరు సరిపోక సమీపంలోని గౌరారం వాగుకు వెళ్లాల్సి వస్తున్నది. అక్కడ చెలిమలు తవ్వి నీళ్లు తెచ్చుకుంటున్నారు. – మంగపేట

# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

- సూర్యాపేట జిల్లా కోటినాయక్ తండా వద్ద రాస్తారోకో

ఆత్మకూర్.ఎస్, మార్చి 24 : వరి పంటలు కోతకు వచ్చే దశలో నీళ్లు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం కోటినాయక్‌తండా వద్ద సూర్యాపేట–దంతాలపల్లి రహదారిపై ఎస్సారెస్పీ కాల్వ వద్ద రైతులు పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. మెయిన్ కెనాల్ నుంచి రెండు రోజులు 22ఎల్ కాల్వకు, రెండ్రోజులు 36ఎల్‌కు, రెండ్రోజులు పెన్‌పహాడ్ వైపు నీళ్లు వదలాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా ఇష్టం వచ్చినట్టుగా గేట్లు తీసి నీటిని మళ్లించడంలో మిగతా ప్రాంతాల పంట పొలాలు ఎండుతున్నాయని 36ఎల్ కెనాల్ కింది రైతులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే సగానికి పైగా పంటలు ఎండిపోయాయని, మిగితా పొలాలు కోత దశకు వచ్చినందున ఈ కొద్దిరోజులైనా పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వాలని కోరారు. 36ఎల్ కెనాల్‌కు నాలుగు రోజులుగా నీళ్లు రావడం లేదని, కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని నినదించారు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడటంతో ఏఈ సురేశ్ క్రేన్ ద్వారా 36ఎల్ కాల్వ గేట్లను ఎత్తి మెయిన్ కెనాల్ గేట్లను మూసివేశారు.

సూర్యాపేట జిల్లా కోటినాయక్ తండా వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

## పంటలు కాపాడాలని రైతుల రాస్తారోకో

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు పంపింగ్ చేసి మిగిలిన పంటలను కాపాడాలని, ఇప్పటివరకు ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో రైతులు సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. – చేర్యాల

## ఇంటికి రూ.2 లక్షలే రుణమాఫీ

- అదే ప్రభుత్వ నిర్ణయం.. దాన్నే అమలు చేశాం
- అసెంబ్లీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఒక్కో ఇంటికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నదే ప్రభుత్వ నిర్ణయమని, దానినే అమలు చేశామని అసెంబ్లీ సాక్షిగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రకటించారు. పద్దుల సమయంలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోకపోయినా మంత్రులు హెలికాప్టర్ల నుంచి దిగడమే లేదని, ఎందుకంత దుబారా చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం రూ.49 వేల కోట్ల మేరకు రైతు రుణమాఫీ చేస్తుందేమో అనుకున్నామని, కేవలం రూ.20 వేల కోట్లు అని అంటున్నారని నిలదీశారు. దీంతో మంత్రి తుమ్మల స్పందిస్తూ రూ.20 వేల కోట్లను ఈరోజు వరకు రుణమాఫీ కింద రిలీజ్ చేశామని తెలిపారు. రూ.33 వేల కోట్ల రైతు భరోసాను ఈ నెలాఖరులో జమ చేస్తామని తెలిపారు.

## రుణమాఫీ చేయాలని రైతుల నిరసన

నిర్మల్ జిల్లా భైంసాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేయాలని రైతులు నిరసన తెలిపారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు ఆందోళన నిర్వహించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నది ఒకటి, చేస్తున్నది మరొకటి అని మండిపడ్డారు. రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు చేయమనడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. – భైంసా

## రుణమాఫీ చేయకుంటే ప్రజల్లో తిరగలేం!

- ఒట్లు వేసి మరీ మాట తప్పడమా..?
- కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి ఆవేదన

జక్రాన్‌పల్లి, మార్చి 24: రైతాంగానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేకపోతే గ్రామాల్లో తలెత్తుకుని తిరగలేమని నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి వాపోయారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలని కోరారు. లేకుంటే కాంగ్రెస్ నాయకులు తలెత్తుకుని తిరగలేని పరిస్థితి వస్తుందని వాపోయారు. అన్ని దేవుళ్లపై ఒట్టు వేసి మరీ మాట ఇచ్చి, ఇప్పుడు మాట మార్చడం సరికాదని హితవు పలికారు. దశలవారీగానైనా రుణమాఫీ చేయాలని కోరారు. లేకుంటే పార్టీ లకతీతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## రైతు నాయకుల ముందస్తు అరెస్టు

### 'చలో అసెంబ్లీ'ని అడ్డుకున్న పోలీసులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 24: జగిత్యాల జిల్లా రైతు జేఏసీ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా నిజామాబాద్ జిల్లా రైతు నాయకులను పోలీసులు సోమవారం అడ్డుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు జేఏసీ సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, ముప్కాల్, ఆర్మూర్ మండలాల్లో రైతులు, నాయకులను స్టేషన్‌కు తరలించారు. రైతు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీలను అమలుచేయకపోగా, కనీసం రైతులు నిరసన తెలుపుకొనే అవకాశం కూడా ఇవ్వకుండా నిర్బంధించడం దారుణమని అన్నారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పోలీసుల అదుపులో రైతు జేఏసీ నాయకులు

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరానికి రూ.10వేలు పరిహారం చెల్లించాలి
- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్,మార్చి24 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాలు, వడగండ్లతో వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని, వెంటనే నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి టీ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా మక్కజొన్న, వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అలాగే పిడుగుపాటుకు ఇద్దరు మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. నష్టాన్ని ప్రాథమిక అంచనాగా రూ.11వేల కోట్లు మాత్రమే జరిగిందని ప్రకటించారని, ఇది వాస్తవం కాదని మండిపడ్డారు. కేంద్రం 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా ప్రకృతి వైపరీత్యాల కింద కేటాయించిన నిధులు కూడా రైతులకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ప్రారంభించలేదని, ''పీఎం ఫసల్ బీమా''లో చేరినప్పటికీ ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులకు పరిహారం రాదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పూర్తి పరిహారాన్ని రైతులకు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రానున్న నెల రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున.. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతోపాటు రైతులకు సలహాలు, సూచనలు అందించాలని వారు డిమాండ్ చేశారు.

# దేవుడి సాక్షిగా రైతు బలవన్మరణం

- సాగునీరు బంధై 2 బోర్ల కోసం, ఇద్దరు కొడుకుల్ని గల్ఫ్ పంపేందుకు అప్పులు
- బాకీల కోసం భూ విక్రయానికి నిర్ణయం
- భూమి అమ్మకానికి తండ్రి పేరు అడ్డంకి
- ఓ సోదరుడు సహకరించలేదని మనోవేదన
- గుడిలో గంటకు ఉరేసుకుని ఆత్మహత్య
- సిరిసిల్ల జిల్లా చిప్పలపల్లిలో విషాదం

ఇప్పటికి రాలిన మట్టిపూలు 460

ముస్తాబాద్, మార్చి 24: పొలంలో సాగునీరు లేక అప్పులు చేసి రెండు బోర్లు వేశాడు. ఉపాధి కరువై ఇద్దరు కొడుకుల్ని గల్ఫ్ పంపేందుకూ చేసిన అప్పులు పెరిగిపోయాయి. ఈ ఊభి నుంచి బయటపడే ఆ రైతు ప్రయత్నాలు ఫలించలేదు. తండ్రి పేరిట ఉన్న తన సొంత భూమి అమ్మకానికి తోడబుట్టిన సోదరుడే సహకరించలేదు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా పరిష్కారానికి నోచలేదు. పోలీస్‌స్టేషన్ మెట్లెక్కినా ఫలితం దక్కలేదు. దీంతో చావే దిక్కనుకున్నాడు. అమ్మ వారే సాక్ష్యం అని నమ్ముకున్నాడో ఏమో? కానీ ఊరి సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో గంటకు ఉరేసుకొని ఆ రైతు తనువు చాలించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా చిప్పలపల్లిలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో చిన్న సాయిలు, ఎల్లవ్వ దంపతులకు నలుగురు కొడుకులు. అందరూ భూమి పంపకాలు చేసుకున్నారు. వారి మూడో కొడుకైన పర్శరాములు (48)కు ఇంటి సమీపంలో 14 గుంటల భూమితో పాటు మరోచోట రెండెకరాలు వచ్చింది. అందులో సాగు చేసుకుంటున్న పర్శరాములు నీళ్ల కోసం అప్పులు చేసి రెండు బోర్లు వేశాడు. తన ఇద్దరు కొడుకులను గల్ఫ్ దేశం పంపించేందుకూ అప్పులు చేశాడు. ఆ బాకీలు తీర్చేందుకు ఇంటి సమీపంలో ఉన్న 14 గుంటల భూమిలో రెండు గుంటల స్థలాన్ని విక్రయించాలని అనుకోగా, అది తన తండ్రి పేరున పట్టా ఉండటంతో సోదరులను సంప్రదించాడు. ఇందులో ఇద్దరు సోదరులు సంతకాలు చేసేందుకు ముందుకు రాగా, పెద్ద సోదరుడు నిరాకరించాడు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. పోలీస్‌స్టేషన్‌కు సైతం వెళ్లాడు. అయినా ఫలితం లేకపోవడంతో చేసిన అప్పులు ఎలా చెల్లించాలనే దిగులుతో మనోవేదనకు గురయ్యాడు. గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ ఆలయంలో ఉన్న గంటకు ఉరేసుకుని పర్శరాములు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు వెళ్లి కన్నీమున్నీరుగా విలపించారు. రైతు భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కరెంట్ షాక్‌తో రైతు మృతి

నాగర్‌కర్నూల్, మార్చి 24: పొలంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్ గ్రామానికి చెందిన రైతు మహమ్మద్ (60) మూడెకరాల్లో మక్కలు సాగు చేశాడు. పంటకు నీళ్లు పెట్టేందుకు సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. బోరు మోటర్ స్టార్టర్ ఆన్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## అప్పులబాధతో పౌల్ట్రీ రైతు ఆత్మహత్య

అనిల్(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 24: అప్పులు అధికం కావడం, బర్డ్‌ఫ్లూ భయం ఆ రైతును వెన్నాడింది. ఇదే సమయంలో కోళ్లఫారం వృథాగా ఉండటంతో అప్పులను తీర్చేదారి లేక మనస్తాపానికి గురైన పౌల్ట్రీ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన పడిగె అనిల్ కుమార్ (26) కోళ్ల ఫారం నిర్వహిస్తుంటాడు. బర్డ్‌ఫ్లూ భయంతో కోళ్లు లేక ఫారం ఖాళీగా ఉన్నది. ఇటీవలే అప్పులు చేసి బోర్లు వేయడంతోపాటు ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. దీంతో అప్పులను తీర్చేదెలా అని మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం అనిల్‌కుమార్ పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య దీపిక, మూడు నెలల కూతురు ఉన్నారు.

పంటలను పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## ఎకరానికి రూ.50 వేలిచ్చి ఆదుకోవాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, మార్చి 24 : అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో నష్టపోయిన పంటలను సోమవారం పరిశీలించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంట నష్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు రైతుల పట్ల ప్రేమ ఉంటే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రిజిస్ట్రేషన్ చేయించి సాయం అందించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా అనేక గ్రామాలకు విద్యుత్తు సరఫరా లేకపోయినా పట్టించుకునే వారు లేరని మండిపడ్డారు.

## ప్రాణాలు పోతేనే కనిపిస్తారా..?

- 20 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోరా!
- మక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించరా..?
- పొదెం వీరయ్యను నిలదీసిన రైతులు, గ్రామస్థులు

అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను నిలదీస్తున్న రైతులు, గ్రామస్థులు

వెంకటాపురం(నూగూరు), మార్చి 24 : రైతు సమస్యలు ఎవరికీ కనిపించవా..? ప్రాణాలు పోతేనే కనిపిస్తారా..? అని మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడు, అటవీ శాఖ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను గ్రామస్థులు, రైతులు నిలదీశారు. మక్కజొన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని 20 రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటేనే పరామర్శించేందుకు వస్తారా..? అని నిలదీశారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని చిరుతపల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మక్కజొన్న రైతులు మధుకృష్ణ, చంద్రరాన్ కుటుంబాలను పరామర్శించేందుకు వీరయ్య వచ్చారు. మధుకృష్ణ కుటుంబానికి మక్కజొన్న ఆర్గనైజర్ నుంచి రూ.3లక్షల చెక్కును అందించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న గ్రామస్థులు, రైతులు వీరయ్యను నిలదీశారు. రైతుల గోస పట్టని రాజకీయం ఎందుకని ప్రశ్నించారు. స్పందించిన వీరయ్య ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపడుతామని, రైతులు ఎవరు అధైర్య పడవద్దని సూచించారు.

## అకాల వర్షంతో పంటలకు తీవ్రనష్టం

అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో దెబ్బతిన్న పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. రైతుభరోసా, రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. –బెజ్జంకి

## హామీలు అమలు చేయాలని ఆందోళన



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు కన్నెర్ర చేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని దిగ్బంధం చేసి ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. సుమారు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. – తిరుమలాయపాలెం

# ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై పోరాడాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావుకు భూనిర్వాసితుల వినతి



హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్ఆర్ భూనిర్వాసితులు

చౌటుప్పల్, మార్చి 24 : చౌటుప్పల్, భువనగిరి ప్రాంతానికి చెందిన రీజనల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఉత్తర భాగం అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అశాస్త్రీయమైన అలైన్‌మెంట్ కారణంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండు ముక్కలు అవుతుందని తెలిపారు. దక్షిణ భాగంలో ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు పరిధిని 40 కిలోమీటర్లు తీసుకుని, ఉత్తర భాగంలో మాత్రం 28 కిలోమీటర్లు తీసుకున్నారని వాపోయారు. ఇప్పటికే 65వ నంబర్ జాతీయ రహదారి, హైటెన్షన్ స్తంభాల ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయామని, ఇప్పుడు ఉన్న కొద్దిపాటి భూమి ట్రిపుల్ ఆర్‌కు ఇస్తే రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. తమ సమస్యపై అసెంబ్లీలో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. హరీశ్‌రావు స్పందిస్తూ సమస్య పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చినట్టు భూనిర్వాసితులు తెలిపారు. నిర్వాసితుల ఐక్య వేదిక కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు దబ్బేటి రాములుగౌడ్, మారుపాక రామలింగంగౌడ్, జాల వెంకటేశ్ యాదవ్, మల్లేశం గౌడ్, ఉన్నారు.

## కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల నిరసన

పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. మూడు నెలల వేతనాలు చెల్లించకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. – రఘునాథపాలెం